కెమికల్ దందా.. ఫాక్స్‌సాగర్ అడ్డా!

చెరువు స్థలంలో యథేచ్ఛగా రసాయనాల వ్యాపారం

- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ, పీసీబీ అధికారులు
- ప్రమాదకరమైన రసాయనాల బాటిళ్లు, కవర్లతో బిజినెస్
- సమాచారం ఇచ్చినా స్పందించని ఇరిగేషన్ అధికారులు
- ప్రైవేట్ సెక్యూరిటీ ఏర్పాటు చేసుకుని పహారా


చెరువు స్థలంలో డంప్ చేసిన రసాయనాల కవర్లు



డేంజర్ లేబుళ్లతో ఉన్న రసాయనాల సీసాలు

జీడిమెట్ల: ఇటు ప్రభుత్వ ఆస్తులకు రక్షణలేదు. అటు ప్రజల ప్రాణాలకు రక్షణలేదు. ఈ రెండింటిని రక్షించాల్సిన అధికారులు పత్తాలేరు. 'ప్రభుత్వ ఆస్తి పోతే నాదేంపోయె.. ప్రజల ప్రాణాలు పోతే నాదేం పోయె'అన్నట్లుగా ఉంది అధికారుల తీరు. ప్రభుత్వ ఆస్తులు, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు ప్రజల గోస పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

అధికారుల అలసత్వం..

జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ స్థలాన్ని ఓ వ్యక్తి తన ఆ. దీనంలోకి తీసుకున్నాడు. అక్కడే మోహన్ ఎంటర్‌ప్రైసెస్ పేరిట ప్రజల ప్రాణాలకు హాని కలిగించే రసాయనాల సీసాలు, ప్లాస్టిక్ కవర్ల దందా నిర్వహిస్తున్నాడు. ఇక్కడే వచ్చింది ట్విస్ట్ ప్రభుత్వ స్థలంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు. రసాయన సీసాలు, కవర్లతో దందా నిర్వహించి ప్రజల ప్రాణాలకు హాని చేస్తున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మూడు విభాగాల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం..

ఇక్కడ దందా నిర్వహించే వ్యక్తులు ఏకంగా బోర్డు ఏర్పాటు చేసుకుని బహిరంగంగా దందా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉన్న రసాయనాల బాటిళ్లు, కవర్లు చూస్తే ఇక్కడ ఎలాంటి కార్యకలాపాలు నడుస్తున్నాయో తెలుస్తుంది. బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి రసాయనాల బాటిళ్లు, కవర్లు నిలవచేయడం వలన పర్యావరణం ఎంత మేరకు కాలుష్యం అవుతుందో అర్థం అవుతుంది. ఇప్పటికైనా మూడు విభాగాల అధికారులు పట్టించుకుని సదరు వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

వాచ్ టవర్‌పై నుంచి ప్రైవేట్ సెక్యూరిటీ పహారా!

ఫాక్స్‌సాగర్ స్థలంలో స్క్రాప్ దందా పెద్ద ఎత్తున్న నడుస్తుంది. ఇక్కడ ముంబై, పూణే లేబుళ్లతో కూడిన డేంజర్ రసాయనాల బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లు ఉన్నాయి. సయానోపిరిడిన్, తియోగ్‌లెక్టోలిక్ యాసిడ్, డైమిథైల్ ఫార్మామైడ్ లాంటి లేబుళ్ల ముంబై, పూణే పేర్లతో ఉన్నాయి. ఈ దందా నిర్వహించే చోట ఏకంగా సదరు వ్యక్తి ఓ వాచ్ టవర్‌ను నిర్మించారు. అక్కడి నుంచే వారి ప్రైవేట్ కాపలాదారు పరిసరాలను గమనిస్తూ ఉంటాడు.అంటే వీరి దందా తీవ్రత అర్థం చేసుకోవచ్చు.


కాపలా కోసం వాచ్ టవర్

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డా.జ్యోతి

రంగారెడ్డినగర్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని గాంధీనగర్‌కు చెందిన వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ అన్నారు. గురువారం ప్రభుత్వ ప్రాథమిక హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని మహాత్మగాంధీ సామాజిక భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ జ్యోతి, ఏఎన్ఎం జగదీశ్వరీ, భారతమ్మ, స్వామీ వివేకానంద యువజన సంఘం నాయకుడు తిమ్మయ్య, ఆశావర్కర్లు శోభన, విజయ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన జలమండలి


డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

చింతల్: జీడిమెట్ల డివిజన్ ఎంఎన్‌రెడ్డినగర్ రోడ్ నం.1లో కొన్ని రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోంది. ఈ విషయమై గురువారం 'డ్రైనేజీ లీకేజీలు అరికట్టండి'అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. జలమండలి మేనేజర్ శివప్రసాద్ ఉదయమే సిబ్బందిని అక్కడకు పంపించి మ్యాన్‌హోల్‌లో వ్యర్థాలను తొలగింపజేశారు. దీంతో మురుగు సాఫీగా వెళ్లడంతో కాలనీవాసులు సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు


సూరారంలో ఓ కిరాణా దుకాణంలో తనిఖీలు

సుభాష్‌నగర్: సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుకాణాల్లో గురువారం ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓం జెండా, సూరారం గ్రామం ప్రాంతాల్లో పాన్ డబ్బాలు, కిరాణా దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎవరైనా మాదకద్రవ్యాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విక్రయదారుల సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


దంపతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం చింతల్ డివిజన్ ఎస్ఎల్‌బీ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని అభినందించి కాలనీ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు బస్వరాజ్, సాయిరెడ్డి, పవన్, ఎస్ఎల్‌బీ నగర్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భరత్, మహేష్, కోశాధికారి బాలస్వామిగౌడ్, అనిల్ షిండే, ఉమాశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్వర్‌రెడ్డి, సలహాదారులు సురేష్ గౌడ్ ప్రకాష్, సభ్యులు వాసుదేవ్,బ్రహ్మం,కట్టయ్య తదితరులు ఉన్నారు.

కులాంతర వివాహం చేసుకున్న జంటకు ఆర్థిక సహాయం..

కులాంతర వివాహం చేసుకొని జీవనం కొనసాగిస్తున్న జంటకు కులంతార వివాహ ప్రోత్సాహకం పథకం కింద మంజూరైన రూ. 2.50 లక్షల చెక్కును గురువారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకర్‌రెడ్డి తదతరులు ఉన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. గురువారం కొంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాతో అత్యధికంగా ఉన్న బీసీలకు 50 శాతం నామినేటెడ్ పోస్టులు ఇచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగులకు జాబ్ క్యాలండర్ ప్రకటించి నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు విజయ్ కుమార్, పాండురంగం, నవీన్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ లైన్ల బైఫెరికేషన్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నిజాంపేట్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వజ్ర నిర్మల ఫీడర్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీలో మధ్యాహ్నం 12.30 నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిజాంపేట్ బీజేపీలో ముసలం!

కార్పొరేషన్ కమిటీ కాదని 3 గ్రామాలకు అధ్యక్షుల నియామకం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీలో ముసలం మొదలైంది. కార్పొరేషన్ మొత్తానికి అధ్యక్షుడిగా ఆకుల సతీష్ ఉన్నారు. జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మల్లారెడ్డి ఆదేశంతో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్ మూడు గ్రామాలకు అధ్యక్షులను నియమించడం ఇప్పుడు వివాదాస్పదం అయ్యింది. దీంతో ఆకుల సతీష్ వర్గం కార్పొరేషన్ కమిటీ కాదని ఎలా నిర్ణయం తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా, మండల కమిటీలు వేసే సమయంలో గ్రామాల అధ్యక్షుల నియామకం ఏమిటని స్థానిక నేతలు ప్రశ్నిస్తున్నారు.

ఆకుల సతీష్‌ను తప్పించడం కోసమే..

◆ రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో లేని గ్రామ కమిటీలు నిజాంపేట కార్పొరేషన్‌లో ఎందుకని ప్రశ్నించారు. సీనియర్ నేతలు చెప్పినా పట్టించుకోకుండా కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ అవినీతి అక్రమాలను వెలికితీయడంపై వారు గుర్రుగా ఉన్నారు. ఆకుల సతీష్‌ను తప్పించడం కోసం పార్టీలోని సీనియర్ నాయకులే పావులు కదిపినట్లు పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీని నిర్వీర్యం చేసేందుకు సీనియర్ నాయకులు పూనుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

అధ్యక్షుల ప్రకటన వెనుక్కు తీసుకోకుంటే రాజీనామాలే..

◆ మూడు గ్రామాల అధ్యక్షుల విభజన ప్రకటన విరమించుకోకుంటే కార్పొరేషన్ కమిటీ సభ్యులు ముక్కుమ్మడి రాజీనామాలు చేస్తామని అధ్యక్షుడు ఆకుల సతీష్ హైకమాండ్‌కు అల్టిమేటం జారీ చేశారు. నిజాంపేట కార్పొరేషన్ బీజేపీ నాయకులను చేర్చుకోవడానికి అధికార పార్టీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. శుక్రవారం ఉదయం 9గంటలలోపు కార్పొరేషన్‌లో గ్రామాల వారీగా అధ్యక్షుల ప్రకటన వెనుక్కు తీసుకోవాలన్నారు. లేకుంటే 10గంటలకు తమ పదవులకు రాజీనామ చేసి నిరసన తెలుపుతామని హెచ్చరించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

వెంకటేష్‌కు ఉత్తమ రిటైల్ వర్టికల్ అవార్డు



హై బిజ్ మీడియా అవార్డుల ప్రదానోత్సవం గురువారం హైటెక్ సిటీలోని నోవాటెల్‌లో నిర్వహించారు. 'సాక్షి' సిటీ ప్రకటనల విభాగం సీనియర్ మేనేజర్ ఎల్.వెంకటేష్‌ను ఉత్తమ రిటైల్ వర్టికల్ అవార్డుతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సత్కరించారు. –కూకట్‌పల్లి

దంపతుల మధ్య గొడవ.. భర్త ఆత్మహత్య


మృతుడు నాగరాజు

సుభాష్‌నగర్: భార్యాభర్తల మధ్య చోటు చేసుకోవడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం తెలుగుతల్లినగర్‌కు చెందిన నాగరాజు, మమతలు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు గండి మైసమ్మలోని గ్లాండ్ ఫార్మాలో పని చేస్తున్నారు. అయితే వివాహం సమయంలో మమతకు నాగరాజు అమ్మమ్మ బంగారు నెక్లెస్‌ను బహుమతిగా ఇచ్చింది. అయితే నాగరాజుకు రూ.7లక్షల అప్పు ఉంది.

దీంతో బంగారు నెక్లెస్‌ను కుదువ పెట్టడంతో ఈనెల 10వ తేదీన భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు రాత్రి సూరారం కాలనీలోని పుట్టింటికి మమత వెళ్లగా ఇంట్లో నాగరాజు ఒక్కడే ఉన్నాడు. రాత్రి 9.30 గంటలకు భర్త మొబైల్‌కు కాల్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. పక్కింటి వారికి అడిగితే ఇంటి గడియ పెట్టి ఉందని చెప్పడంతో అనుమానం వచ్చి చూడగా నాగరాజు ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతడిని కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి


పనులు ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ కృష్ణ

దుండిగల్: మున్సిపల్ పరిధిలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. గురువారం దుండిగల్ 5వ వార్డులో రూ.15 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు, కృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికే మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లను దాదాపు అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల కృష్ణయాదవ్, ఆనంద్‌కుమార్, గోపాల్ రెడ్డి, శంక నాయక్, మహేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, విష్ణుయాదవ్, ఉప్పరి కృష్ణ, ముత్యంరెడ్డి, శంకరప్ప, బాల్‌రెడ్డి, నాగేష్, దార మహేష్, భాస్కర్ ఉన్నారు.

పద్మ బ్రాహ్మణులను ప్రోత్సహించడానికి సిద్ధం

రుద్ర పాండురంగ శాస్త్రి



చింతల్: గ్రేటర్ హైదరాబాద్ పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం కార్యవర్గ సమావేశం గురువారం జగద్గిరిగుట్టలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు రుద్ర పాండురంగ శాస్త్రి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వంశీ భట్టాచారి, ప్రధాన కార్యదర్శి గడ్డం మల్లికార్జున సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీ కులస్తులు కొందరు చేనేత వృత్తిలో, మరికొందరు బ్రాహ్మణ వృత్తిలోనూ రాణిస్తున్నారని అన్నారు. వీరు ఎన్నో ఏళ్లగా పూజలు, హోమాలు, విగ్రహ ప్రతిష్ఠలు శాస్త్రనుసారంగా చేస్తూ సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అతి త్వరలో పద్మ బ్రాహ్మణుల వివరాలతో కూడిన డైరీని ఆవిష్కరించి పద్మశాలి సంఘాలకు అందజేస్తామని తెలిపారు. పద్మ బ్రాహ్మణులను ప్రోత్సహించడానికి సంఘ పెద్దలు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశానికి పద్మశాలి సంఘం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడిచెర్ల మారుతి, జగద్గిరిగుట్ట సంఘ అధ్యక్షుడు భోగ రాజేష్, పల్లి దత్తాత్రేయ, తోట రాములు, గూడూరి లక్ష్మీనరసింహ, శ్రీరామ్ నగర్ సంఘ అధ్యక్షులు నారా వెంకటేశం, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


స్వరూప (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనుమానాదస్పద స్థితిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయరామ్‌నగర్‌కు చెందిన కాశీరామ్, స్వరూప(22)లు భార్యాభర్తలు. ఈనెల 9వ తేదీన స్థానికంగా ఉండే స్వీట్స్ తయారీ కంపెనీలో పనిచేసేందుకు వెళ్లిన స్వరూప రాత్రైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కాశీరామ్ స్వీట్స్ కంపెనీ వద్దకు వెళ్లి ఆరా తీయగా జ్వరం కారణంగా విధులకు రావడం లేదని స్వరూప చెప్పినట్లు పేర్కొన్నారు. ఆమె మొబైల్‌కు యత్నించగా స్విచ్ఛాఫ్ రావడంతో పుట్టింట్లో, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోయింది. భర్త కాశీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్తా

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్


సుచిత్ర చౌరస్తాలో వాహనదారుల ఇబ్బందులను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: వాహనదారుల ఇబ్బందులను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఆయన సుచిత్ర చౌరస్తాను సందర్శించి వాహనదారులు పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను రైల్వే శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ... సుచిత్ర చౌరస్తాలోని రైల్వే ట్రాక్ వద్ద సబ్ రోడ్డు, కుత్బుల్లాపూర్ – అల్వాల్ రోడ్డులో రైల్వే అండర్ పాస్ లైన్‌లను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

చెరుకుపల్లి చంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం

కుత్బుల్లాపూర్: బీజేపీ సీనియర్ నాయకుడు, దివంగత చెరుకుపల్లి చంద్రారెడ్డి జయంతి వేడుకలు శుక్రవారం జీడిమెట్లలో ఘనంగా జరిగాయి. బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై చంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద, బడుగు వర్గాలకు ఇళ్లను అందించడంలో చంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎంపీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపజీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, జిల్లా నాయకులు గిరివర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, సుధా, వెంకటేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, సదానందం, చండి శ్రీనివాస్, పత్తి రఘుపతి, కట్టకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలను సత్కరించిన మంగమ్మ..

దుండిగల్: మేడ్చల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు, బౌరంపేట మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ గురువారం ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా గెలిచిన అనంతరం మొదటిసారి ఆయనను కలవడంతో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని వివరించారు.


చంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల, భరతసింహారెడ్డి


ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ

అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


పవన్ కళ్యాణ్ (ఫైల్)

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ తాండ–1కు చెందిన పవన్ కళ్యాణ్(24) కొంత కాలంగా సారెగూడెంలో కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. యువకుడి తల్లి అనిత రెండు రోజుల క్రితం తన స్వగ్రామమైన నర్సాపూర్‌కు వెళ్లింది. ఈ నెల 10వ తేదీన రాత్రి తనకు ఆహారం కావాలని పవన్ తన తమ్ముడికి చెప్పగా ఇచ్చి వెళ్లాడు. పరంసింగ్ తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లాడు. ఇంట్లో పవన్ కింద పడగా తలకు గాయం కావడంతో పక్కనే మరో ఇంట్లో ఉంటున్న మహిళ అతడికి పసుపు పెట్టి వెళ్లింది.

◆ పరంసింగ్ గురువారం తెల్లవారుజామున 3గంటలకు తన స్నేహితుడి కలిసి ఇంటికి వచ్చేసరికి పవన్‌కళ్యాణ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే అతడిని కిందికి దింపి పరిశీలించగా మృతి చెందాడు. తల్లి అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

◆ ఇదిలా ఉండగా పవన్, పరంసింగ్‌లకు సొంత గ్రామంలో ఉన్న భూమి విషయంలో వివాదం నడుస్తుందని, డబ్బుల విషయంలో అన్నదమ్ముళ్ల మధ్య గొడవ జరిగిందని సమాచారం. పవన్ ఆత్మహత్య చేసుకున్నాడా.? లేక తన అన్నని తమ్ముడే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రికరించాడా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలనుంది. పోస్టుమార్టం నివేదికలో పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

రెండ్రోజుల క్రితం అదృశ్యమై.. తండ్రి మృతితో ఇంటికి చేరి!

దుండిగల్: ఓ వెంచర్ నిర్మాణ సంస్థ వేధింపుల కారణంగా అదృశ్యమైన వ్యక్తి తిరిగి ఇంటికి చేరాడు. వివరాల్లోకి వెళితే.. బౌరంపేట గ్రామానికి చెందిన వంపుగూడెం మాధవరెడ్డికి డి.పోచంపల్లిలో 1.13 ఎకరాల స్థలం ఉంది. పక్కనే నిర్మిస్తున్న త్రిపుర ల్యాండ్ మార్క్ సంస్థ అతడికి చెందిన భూమిని విక్రయించాలని వేధింపులకు గురి చేసింది. దీంతో మనస్తాపం చెందిన మాధవరెడ్డి ఈనెల 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాగా అతని తండ్రి కృష్ణారెడ్డి 10వ తేదీన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాధవరెడ్డి గురువారం ఇంటికి వచ్చాడు. అదే రోజు తండ్రి అంత్యక్రియలను నిర్వహించారు. మాధవరెడ్డి ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

జూదరుల అరెస్టు

జీడిమెట్ల: పేకాతున్న 8మందిని జీడిమెట్ల, బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఠాణా పరిధిలోని గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో కొంతమంది పేకాడుతున్న సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు పేకాడుతున్న 8మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,90,000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.